టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మడం లేదు

- ఎన్నికల్లో లబ్ధి కోసమే ఆచరణ సాధ్యం కాని హామీలు
- అబద్ధాలు, వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు
- విశాఖ నుంచే పాలన జరగాలంటే జగనే ముఖ్యమంత్రి కావాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- పాత మధురవాడలో వైఎస్సార్‌సీపీలోకి చేరికలు


పాత మధురవాడలో ముత్తంశెట్టిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు


మిథిలాపురి వుడా కాలనీలో నాయకులకు గుమ్మడికాయలతో దిష్టి తీసి, హారతిస్తున్న మహిళలు

మధురవాడ: అబద్ధాలు, వంచన, వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు నాయుడు అని, అతని మాటలు నమ్మి ఎవ్వరూ మోసపోవద్దని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డులోని మిథిలాపురి వుడా కాలనీ వేంకటేశ్వర ఆలయం వద్ద గల హుద్‌హుద్ హౌసింగ్ కాలనీ, వుడా కాలనీ, పాత మధురవాడ, బింద్రా నగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మహిళలు నాయకులకు గుమ్మడి కాయలతో దిష్టి తీసి, హారతులిచ్చి సాదరంగా స్వాగతం పలికారు. అలాగే పాత మధురవాడ మెట్టపై ముత్తంశెట్టిని నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి చెల్లించలేదని, మహిళలకు రుణమాఫీ అమలు చేయలేదని గుర్తు చేశారు. మళ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రస్తుతం అమలుకాని హామీలు ఇస్తున్నాడని, వాటిని ఎవరూ నమ్మి మోసపోవద్దని సూచించారు. పొరపాటున టీడీపీ నాయకుల మాటలు నమ్మితే రాజధాని అమరావతికి వెళ్లిపోతుందని, సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని, వలంటీర్, సచివాలయ వ్యవస్థ రద్దు చేసేస్తారన్నారు.

జగన్ గెలిస్తేనే విశాఖ నుంచి పాలన

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని, పాలన మనకు చేరువ నుంచే సాగుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఈ ప్రాంతవాసులు అంతా జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ ఎన్నికలు పేదలు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు దర్జాగా బతకాలంటే మళ్లీ జగన్ మోహన్ రెడ్డినే ఎన్నుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో చెప్పినవి, చెప్పనివి కూడా చేసి చూపించిన నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. కరోనా సమయంలో వలంటీర్ల ద్వారా ఎంతో సాయం చేశారని, సంక్షేమ పథకాలూ కొనసాగించారన్నారు. అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.


పాత మధురవాడలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు

జీవీఎంసీ 8వ వార్డు పాత మధురవాడలో వివిధ పార్టీలకు చెందిన 50 కుటుంబాలకు చెందిన వారు పార్టీ విధానాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, నాయకులు చెన్నా దాసు, లొడగల రామ్మోహన్, ముదుండి రాజేశ్వరి, ఎంపీ రమణమూర్తి, ఎం.జ్యోతిర్మయి, ఎస్.నాగభూషణం, మీసాల సత్యం, మానం శ్రీను, కరుణాసాగర్ పాల్గొన్నారు.

యాదవులంతా వైఎస్సార్ సీపీతోనే

ఎమ్మెల్యేను కలిసి మద్దతు తెలిపిన నాయకులు


ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మద్దతు తెలుపుతున్న యాదవ సంఘాల ప్రతినిధులు

తగరపువలస : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో యాదవులకు అనేక ఉన్నత పదవులతోపాటు సంక్షేమ పథకాలు అందించారని జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట అధ్యక్షుడు నమ్మి మాధవరావు అన్నారు. ఎవరో ఒకరిద్దరు స్వార్థపరులు పార్టీని వీడినంత మాత్రాన తామెవరూ వైఎస్సార్‌సీపీని వీడమన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును నగరంలోని ఆయన నివాసంలో గురువారం కలిసి మద్దతు తెలిపారు. భీమిలి అసెంబ్లీ, విశాఖ పార్లమెంట్ పరిధిలో యాదవులంతా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేకు యాదవ నాయకులు పీతల వెంకట అప్పారావు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు నమ్మి అప్పలనాయుడు, సారిపల్లి మోహనరావు, నమ్మి లక్ష్మణ, బోర వెంకట అప్పారావు, కొయ్య దినేష్, బోర రామారావు, పీతల రాజారావు, కర్రి బుజ్జి, కేవీ రావు, తదితరులు మద్దతు తెలిపారు.

క్లుప్తంగా

13 మందికి శస్త్రచికిత్సలు

తగరపువలస: ఆనందపురం పీహెచ్‌సీలో గురువారం 13 మందికి కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్సలు నిర్వహించారు. మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన మహిళలకు కేజీహెచ్ నుంచి వచ్చిన వైద్య నిపుణుడు బి.ఆనంద్ శస్త్రచికిత్సలు పూర్తి చేశారు. ఆయనకు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, షేక్ సహనాజ్ సాధియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ సహకారం అందించారు.

ర్యాలీకి పిలిచి.. పచ్చ కండువాలు వేసేసి...

తగరపువలస : భీమిలి రూరల్ మండలం మూలకుద్దు పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన 40 మందికి టీడీపీ నాయకులు గురువారం బలవంతంగా పచ్చ కండువాలు వేశారు. ర్యాలీకి రమ్మని పిలిచి తమకు కండువాలు వేసినట్టు స్థానికులు వాపోయారు. కూలి పనులు చేసుకునే తమను పృథ్వీ అనే టీడీపీ కార్యకర్త ర్యాలీకి వస్తే రూ.400, బిర్యానీ ఇస్తామని మభ్యపెట్టి భీమిలి తీసుకెళ్లాడన్నారు. అక్కడకు వెళ్లాక తమకు ఇష్టం లేకుండా పచ్చ కండువాలు వేయడంతో అవాక్కైపోయామన్నారు. తాము సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఎంతో లబ్ధి పొందామని, టీడీపీకి ఓటు వేసే ప్రసక్తే లేదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మోసాలకు పాల్పడవద్దని టీడీపీ నాయకులను హెచ్చరించారు.

జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేద్దాం

కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక పిలుపు


ఆర్‌హెచ్ కాలనీలో మహిళకు కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక

పీఎం పాలెం : ప్రజా సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేసి నూతన ఒరవడి సృష్టించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ ఆరో వార్డులోని పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మరోమారు ఎమ్మెల్యేగా విజయం సాధించడం ఖాయమన్నారు. ఎన్నికల సమయంలో ముఖం చూపించే టీడీపీ అభ్యర్థికి ఓటమి రుచి చూపించడానికి భీమిలి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఆరో వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, పోతిన ప్రసాద్, యల్లాజీ, సియ్యాద్రి కనకరాజు, ఎం.ఈశ్వరరావు, జామి శివకుమార్, గాయత్రినగర్ అప్పారావు, రాయిసాయి కుమార్, అనూష, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి కళింగ వైశ్య సంఘాలు


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధిలోని 5 కళింగ వైశ్య సంఘాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ప్రతినిధులు, వారి అనుచరులు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్‌షెడ్ జంక్షన్ వద్ద గల వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బోగి సాంబశివరావు, ఇప్పలి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

యల్లపువానిపాలెంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం


మాట్లాడుతున్న అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, గేదెల మురళీకృష్ణ, మోహన్‌రావు

గోపాలపట్నం: యల్లపువానిపాలెం టీడీపీ మాజీ అధ్యక్షుడు పొలమరశెట్టి మోహనరావు వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం రాత్రి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో ఆయన చేరారు. గురువారం 89వ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ గురువారం విలేకర్ల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రామంలో మంచి పేరు ఉన్న నాయకుడు మోహన్‌రావు అని, ఆయన చేరికతో వైఎస్సార్ సీపీకి మరింత బలం చేకూరినట్టయిందన్నారు. జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్ గేదెల మురళీకృష్ణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.150 ఇస్తామంటే వచ్చాం... ఏంటీ అవస్థలు..!

- భీమిలిలో మూడు గంటలు ఆలస్యంగా గంటా ప్రచారం
- ఎండవేడిమి తాళలేక ముందే వెనుదిరిగిన మహిళలు


గంటా ప్రసంగిస్తుండగా వెళ్లిపోతున్న జనం

భీమునిపట్నం: అసలే ఎండలు మండిపోతున్నాయి... దానికి తోడు గంటల తరబడి ఒక చోట వేచి ఉండమంటే ఎంత నరకప్రాయమో అందరికీ తెలిసిందే. గురువారం భీమిలిలో అదే జరిగింది. ఇక్కడి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 : 30కి గ్రామ దేవత శ్రీనూకాలమ్మ ఆలయం వద్ద ప్రారంభమై మెయిన్ రోడ్డుతోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వుంది. దీంతో డబ్బులిచ్చి తీసుకొచ్చిన జనం అమ్మవారి గుడి వద్దకు పది గంటలకు చేరుకున్నారు. అనంతరం గంటలు గడుస్తున్నా గంటా జాడ కానరాలేదు. ఇందులో మహిళలు ఎక్కువగా ఉండడం... చాలా మంది పిల్లలతో రావడంతో వారంతా ఎండ వేడికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కొక్కరికి రూ.150 ఇస్తామని నాయకులు తీసుకొచ్చారని... ఈమాత్రం డబ్బులకు ఇంత సేపు ఎందుకు నిరీక్షించాలని మహిళలంతా బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. కొంతమంది ఇక ఉండలేక ఇళ్లకు వెనుతిరిగారు. అయితే 12 : 30 గంటలకు గంటా ఇక్కడకు చేరుకుని మాట్లాడుతుండగా ఎదురుగా ఉన్న చాలా మంది అక్కడి నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. ఇంత ఎండల్లో చెప్పిన సమయానికి రాకపోతే ఎవరూ గంటల తరబడి ఉండే పరిస్థితులు లేవని పలువురు అంటున్నారు.

పింఛనుదారులకు మరిన్ని కష్టాలు

- లబ్ధిదారులతో కిటకిటలాడిన బ్యాంకులు
- చంద్రబాబు, నిమ్మగడ్డ తీరుపై ఆగ్రహం

తగరపువలస : చంద్రబాబు, నిమ్మగడ్డ ప్రసాద్ వంటి పచ్చ ముఠా కుట్రతో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వలంటీర్లు ద్వారా పింఛన్లు పంపిణీ చేస్తే ఓటర్లను ప్రభావితం చేస్తారన్న సాకుతో ఎన్నికల కమిషన్‌కు నిమ్మగడ్డ ప్రసాద్ ఫిర్యాదు చేసి ఏప్రిల్ నెలలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయకుండా అడ్డు తగిలారు. దీంతో గత నెల పింఛన్లు సచివాలయాల ద్వారా పంపిణీ చేయగలిగారు. ఎండల కారణంగా పింఛనుదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో మే నెలకు సంబంధించి ఈ బృందం యూ టర్న్ తీసుకున్నారు. పింఛను సొమ్ము లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేయాలని గత 20 రోజులుగా ఎన్నికల కమిషన్ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీంతో ఈ నెలకు సంబంధించి పింఛనుదారులు మరిన్ని కష్టాలు ఎదుర్కొంటున్నారు. చాలా మందికి తమ పింఛన్ల నగదు బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందో లేదో తెలియక ఇబ్బంది పడుతున్నారు. గత నెల గ్రామంలోని సచివాలయంలోనే పింఛను అందుకున్న లబ్ధిదారులు ఇప్పుడు మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లోని బ్యాంకుల వద్దకు ఆపసోపాలు పడి చేరుకుంటున్నారు. సాధారణ రోజుల కంటే ఎక్కువ మంది పింఛనుదారులతో బ్యాంకులు నిండిపోవడంతో అక్కడ మిగిలిన లావాదేవీల కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయి. పింఛనుదారుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు కావడం వల్ల విత్‌డ్రా ఫారం నింపడానికి రూ.20 మొదలు తమ గ్రామం నుంచి ఆటో ఛార్జీలకు రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా చెల్లించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎక్కువ మంది వృద్ధులు ఎండ దెబ్బకు తాళలేక సొమ్మసిల్లిపోతున్నారు.

పథకాలు అడ్డుకునేందుకు టీడీపీ కుట్ర



పచ్చనేతలు పింఛనుదారులపై రెండు నెలలుగా పగబట్టారు. కడుపులో చల్ల కదలకుండా ఒకటో తేదీ సూర్యోదయానికి ముందే వలంటీర్లు ఇంటికి తెచ్చి పింఛన్లు ఇచ్చేవారు. ఎన్నికల్లో మాత్రమే వచ్చే చంద్రబాబు అతని మనుషులు సంక్షేమ పథకాలు అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. వారికి ఉసురు తగిలి తీరుతుంది.

– చుక్క నాగమ్మ, భీమిలి

ఎన్నికల నిబంధనలకు తూట్లు


కోలవానిపాలెంలో రక్షిత మంచినీటి ట్యాంకర్‌పై కట్టిన జనసేన జెండా

తగరపువలస: ఆనందపురం మండలం కోలవానిపాలెంలో జనసేన నాయకులు ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడిచారు. గ్రామం మధ్యలో ఉన్న రక్షిత మంచినీటి పథకానికి జనసేన జెండా కట్టి ఉంచారు. ఎన్నికల సంఘం అధికారులు జోక్యం చేసుకుని దీనిని తొలగించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

‘ఫ్యాన్’కు ఓటేద్దాం.. సంక్షేమ పాలన కొనసాగిద్దాం

విస్తృతంగా వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం


లక్ష్మీపురంలో ప్రచారంలో వైస్ ఎంపీపీ బంగారునాయుడు, సర్పంచ్ జగదీష్


దాకమర్రిలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ పైడప్పడు, వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస : ‘ఫ్యాన్’కు ఓటేద్దాం.. సంక్షేమ పాలన కొనసాగిద్దామని వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాల కొనసాగింపునకు సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. భీమిలి మండలం అమనాంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. లక్ష్మీపురం పంచాయతీలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, కరుభుక్త అప్పలనారాయణ, ఉప సర్పంచ్ బమ్మిడి అప్పన్న, రమణ, పూసర్ల ఎర్రయ్య, కరుభుక్త శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు. శింగనబంద పంచాయతీలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, జిల్లా కార్యదర్శి మద్దిల వెంకటరమణ, కేపీ సత్యనారాయణ, కాళ్ల సన్యాసిరావు తదితరులు ప్రచారం చేశారు. దాకమర్రి పంచాయతీలో సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు నగేష్, తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ రెండో వార్డు సంతపేటలో పార్టీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, నీలాతి రాము తదితరులు ప్రచారం నిర్వహించారు. రేఖవానిపాలెం పంచాయతీలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పీతల గంగ శ్రీను, మల్లేటి హరి తదితరులు ప్రచారం చేశారు.

భీమునిపట్నం: జీవీఎంసీ 3వ వార్డులో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో గురువారం ప్రచారం చేశారు. గెడ్డవీధి, రొట్టెవీధి, పరిసర ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. సంకురుభుక్త రమేష్, బోని శ్రీను, కొంకి వెంకటేష్, ప్రగడ చంటి, ముకుంద సంతోష్, కాళ్ల సురేష్, తాడివాడ కుమార్, జరజాపు ప్రసాద్, ఎల్.సురేంద్ర, ఎల్.నూకరాజు, జె.శ్రీను, పైల సాయి, చందక రాజశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

పద్మనాభం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఆధ్వర్యంలో రేవిడిలో నిర్వహించిన ప్రచారంలో సర్పంచ్ కోన రమణ, మరగడ అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు శీర సూరప్పడు తదితరులు పాల్గొన్నారు. పద్మనాభం పంచాయతీలో సర్పంచ్ తాళాడ పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు. రెడ్డిపల్లి పంచాయతీలో ఉప సర్పంచ్ శిరిగుడి ఆదిబాబు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఈర్ల ఈశ్వరరావు, తదితరులు ప్రచారం చేశారు.

పద్మనాభం : మండలంలోని కొవ్వాడలో గురువారం సాయంత్రం ఎంపీపీ కె.రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.


అమనాంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ వాసురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు


శింగనబందలో ప్రచారం నిర్వహిస్తున్న గాడు శ్రీను, కేపీ, మద్దిల వెంకటరమణ


సంతపేటలో ఎన్నికల ప్రచారంలో జీవీఎంసీ 2వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు


రేఖవానిపాలెంలో ప్రచారంలో సర్పంచ్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు


కొవ్వాడలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ రాంబాబు, కోరాడ లక్ష్మణరావు


పద్మనాభంలో ఇంటింటా ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


రేవిడిలో కరపత్రం అందిస్తున్న నాయకులు


రెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం


జీవీఎంసీ 3వ వార్డులో ప్రచారంలో నాయకులు

చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తగులుతుంది


యాదవ సంఘ నాయకులు బహూకరించిన మేకపిల్లతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు


బోరవానిపాలెంలో కరపత్రం అందజేసి ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ముత్తంశెట్టి

- బోరవానిపాలెం సభలో గ్రామస్తుల ఆవేదన
- యాదవులకు వైఎస్సార్ సీపీలో అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: వృద్ధులు, వికలాంగులకు ఒకటో తేదీన పింఛన్ నగదు అందకుండా చంద్రబాబు నాయుడు కుట్ర చేశాడని, దాని వల్ల ఎంతో మంది అవస్థలు పడుతున్నారని, వారి ఉసురు తగలక మానదని జీవీఎంసీ 5వ వార్డు బోరవానిపాలెంకి చెందిన గ్రామ పెద్ద బోర నాయుడు సూరి, చంద్రరావు, తదితరులు వాపోయారు. పొద్దు పొడవక ముందే వలంటీర్లు వచ్చి పింఛన్ నగదు ఇచ్చేవారని... అది అందకుండా చేసిన పాపం టీడీపీ నాయకులదే అన్నారు. జీవీఎంసీ 5వ వార్డులోని మారికవలస, బోరవానిపాలెం, అంబేడ్కర్ కాలనీ, పరదేశిపాలెం, పరదేశిపాలెం ఈడబ్ల్యూఎస్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్రలకు చంద్రబాబు పెట్టింది పేరన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, విశాఖ పరిపాలన రాజధాని కావాలన్నా... సీఎం జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. యాదవ సామాజిక వర్గానికి వైఎస్సార్‌సీపీ అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. మారికవలసలో యాదవ సామాజికవర్గానికి చెందిన నాయకులు ముచ్చు రామారావు ఆధ్వర్యంలో మేక పిల్లను ఎమ్మెల్యేకు బహూకరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు, పోతిన సురేష్‌కుమార్, జీఎస్ రెడ్డి, పరదేశి, సన్ని, బోయి సూర్రెడ్డి, బోర శ్రీనువాస రెడ్డి, అప్పలరాము, రాజు, చంటి, అప్పలరెడ్డి, చిన్నారెడ్డి, చందక అప్పలరాజు, గోవింద రెడ్డి, వెంపాడ అప్పలరాజు, సురేష్, మురారి, బీవీ రమణ పాల్గొన్నారు.

మారికవలసలో 50 కుటుంబాల చేరిక

మారికవలస గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ ప్రజారంజక పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు చెప్పారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ముత్తంశెట్టికి 200 మంది భక్తుల మద్దతు


త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భక్తులు

భీమునిపట్నం: భీమిలిలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక విజయనగరం కమిటీ ఆనందాశ్రమం అధ్యక్షుడు కె.త్రినాథరావు, ఇతర సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది భక్తులు వైఎస్సార్‌సీపీకి, ఎమ్మెల్యే ముత్తంశెట్టికి తమ మద్దతు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత సేవా సమితి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తోందని, వారికి ప్రత్యేక అభినందనలని పేర్కొన్నారు. తెలుగు వారందరికీ తెలిసేలా తెలుగు క్యాలెండర్ రూపొందించి అందివ్వడం మంచి విషయమన్నారు. భక్తులంతా తనకు మద్దతు ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉందని, వారికి తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన, ఎమ్మెల్యే ముత్తంశెట్టి పనితీరు నచ్చి తామంతా మద్దతిస్తున్నామని తెలిపారు. సభ్యులు గౌతం శివకుమార్, కృష్ణ, సూరప్పడు, పైడన్న, జయరాం, గోవింద, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పద్మనాభం: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా రేవిడి ఫీడర్‌లోని రేవిడి, బర్లపేట, పాండ్రంగి, కొండ బర్లపేట, కురపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డు చంద్రంపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ వై.రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. అప్పారావు అనే వ్యక్తి నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.